క్లుప్తంగా

నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తాం



వాహనాలు పట్టుకుంటున్న పోలీసులు

జగిత్యాలక్రైం: నంబర్ ప్లేట్ వాహనాలను సీజ్ చేస్తామని పట్టణ సీఐ వేణుగోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని 25 వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనానికి ముందు, వెనుక నంబర్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. వాహనానికి ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తప్పనిసరి అని, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు కూడా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు.

నిల్వ నీటితోనే వ్యాధులు



నిల్వ నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

రాయికల్: వర్షాకాలంలో నిల్వ నీటితోనే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటిని వెంటనే తొలగించాలని రాయికల్ మున్సిపల్ కమిషనర్ చిరంజీవి సూచించారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటిని తొలగించాలని ఇంటి యజమానులను కోరారు. పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ సాధ్యమన్నారు. ఆయన వెంట ఆయా వార్డుల కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం



మల్లేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాయికల్: మహానంది జాతీయ అవార్డు గ్రహీత గన్నవేని మల్లేశ్‌యాదవ్‌ను బుధవారం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. సామాజిక సేవ రంగంలో ఎంతో మందికి సేవ చేసినందుకు గాను మల్లేశ్‌యాదవ్‌కు అవార్డు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొల్లూరి వేణు, నాయకులు వెల్మల ప్రతాప్‌రెడ్డి, నాయిని శ్రీనివాస్‌గౌడ్, మద్దిపల్లి నారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి జీవితంలో బదిలీలు సాధారణం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్‌ఎం

మల్లాపూర్: ఉపాధ్యాయులు బాలకృష్ణ భాస్కర్, రాజేశం, పీఈటీ శ్రీకాంత్ సేవలు మరువలేనివని హెచ్‌ఎం పిన్నంశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, పీఈటీని బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా భాస్కర్, రాజేశం, శ్రీకాంత్‌లు బాధ్యతలు చేపట్టిన తర్వాత పాఠశాల అభివృద్ధికి పరితపించారని, అంకితభావంతో సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో సాతారం హైస్కూల్ హెచ్‌ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లూయిస్ డాగురేకు నివాళి



ధర్మపురిలో నివాళి అర్పిస్తున్న ఫొటో గ్రాఫర్లు

ధర్మపురి: కెమెరా సృష్టికర్త లూయిస్ జాకస్ మాండే డాగురే వర్ధంతిని ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్మపురిలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. డాగ్యురే సృష్టించిన కెమెరా ప్రపంచ దేశాలకు జీవనాధారమైందని అన్నారు. కార్యక్రమంలో ధర్మపురి, బీర్‌పూర్ మండల యూనియన్ అధ్యక్షులు అయ్యోరి సత్యం,మండల ప్రధాన కార్యదర్శి రామడుగు సునిల్, సభ్యులు దాసరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



మేడిపల్లిలో చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, ఇరిగేషన్ అధికారులు

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూరు శివారు వాగులో చెక్‌డ్యామ్‌ను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం పరిశీలించారు. సుమారు 60 ఏళ్ల క్రితం నిర్మించిన చెక్ డ్యామ్ వరదతో పూర్తిగా దెబ్బతినటంతో పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. చెక్‌డ్యాం దెబ్బతినటంతో వర్షాకాలంలో వరద నీళ్ల పాల చెరువులోకి వెళ్లకుండా పెద్ద వాగులో కలిసి పోతున్నాయి. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ తిరుమల్ కుమార్, ఏఈ సీరజ్, మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, రైతులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: చెరువుల మరమ్మతుపై దృష్టి సారించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మేడిపల్లిలోని పెద్ద చెరువును బుధవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. చెరువు తూము ఏర్పాటు కు అవసరమయ్యే ఖర్చును అంచనా వేసి, ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ అరుణ్‌కుమార్, తిరుపతి,హరీశ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇటీవల కురిసిన వర్షాలకు యామాపూర్, ఫకీర్‌కొండాపూర్ వెళ్లేదారిలో తాత్కలికంగా నిర్మించిన రోడ్డు తెగిపోయింది. బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పరిశీలించి, మరమ్మతులు చేపట్టి, రాకపోకలు పునరుద్ధరించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఫకీర్‌కొండాపూర్ శివారులోని పుష్కరఘాట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, నాయకులు దేవయ్య, ధశరథ్‌రెడ్డి,పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

కోరుట్లరూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం నియోజకవర్గంలోని వ్యవసాయ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



చింతకుంటలో మాట్లాడుతున్న ఎస్సై నవీన్‌కుమార్



వెల్గటూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై ఉమాసాగర్

కోరుట్ల రూరల్: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో నూతన చట్టాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కిరణ్ కుమార్ నూతన చట్టాలు, సైబర్ క్రైమ్స్ గురించి వివరించారు. ఎవరైనా గంజాయి రవాణా చేసినా, సేవించినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు.డయల్ 100 పై అవగాహన కల్పించారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకూడదు

వెల్గటూర్ : విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసగా మారి వారి జీవితాలను పాడు చేసుకోకూడదని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్ అన్నారు. కుమ్మరిపల్లి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా, ఉన్నత విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కట్ల శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై నవీన్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ లీలా నాయక్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 'ఆశా'ల నిరసన



మల్లాపూర్, కథలాపూర్‌లో తహసీల్దార్ కార్యాలయాల వద్ద దీక్షలో కూర్చున్న ఆశావర్కర్లు

మల్లాపూర్ /కథలాపూర్: తమ న్యాయమైన డిమాండ్లు అంగీకరించి, సమస్యలు పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు బుధవారం నిరసన చేపట్టారు. రాయికల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట, మల్లాపూర్, కథలాపూర్ తహసీల్దార్ కార్యాలయాల ఎదట నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి నెలా రూ.10వేల పెన్షన్ అందించాలని, కేంద ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయా మండలాల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మెట్‌పల్లిరూరల్: ఆశా కార్యకర్తల విషయంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను మానుకోవాలని మెట్‌పల్లి ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణకు ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బుధవారం కార్యాలయంలో ఆయనను కలిసిన ఆశా కార్యకర్తలు తమ సమస్యలను విన్నవించారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

రాయికల్/పెగడపల్లి: సమాన పనికి సమాన వేతనం చెల్లించి తమను పర్మినెంట్ చేయాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేశారు. డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంటు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్ చెల్లించాలని, ఓపీఎస్‌ను రద్దుచేయాలని, డిమాండ్లను నెరవేర్చాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు జయప్రద, మనెమ్మ, సత్య, వనజాత, మండలంలోని వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వెల్గటూర్ : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వెల్గటూర్ మండల అంగన్‌వాడీ టీచర్లు బుధవారం నాయబ్ తహశీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు శంకరమ్మ, సెక్టార్ అధ్యక్షురాలు మల్లీశ్వరి, జయశ్రీ, తిరుమల, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



వేంపల్లిలో కేక్ కట్ చేస్తున్న గంగపుత్రులు

మల్లాపూర్: గంగపుత్రులను ఎస్టీ జాబితాలో చేర్చాలని గంగపుత్ర సంఘం మండల నాయకుడు రొద్ద రాజు అన్నారు. మండలంలోని వేంపల్లిలో బుధవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో జాతీయ మత్స్యకారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 శాతం నిరుపేదలైన గంగపుత్రులకు ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి గంగపుత్రుడికి రూ.3,000ల జీవనభృతి పెన్షన్ అందించాలని కోరారు. అంతకుముందు గ్రామశివారులో స్థానిక చెరువు వద్ద చేపలు పట్టే పనిముట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు గంగరాం, లక్ష్మీనారాయణ, గంగరాజం, ధర్మేందర్, రిశ్వంత్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వికలాంగుల చైర్మన్‌ను కలిసిన బుచ్చన్న

జగిత్యాలరూరల్: రాష్ట్ర వికలాంగుల చైర్మన్ ముత్తినేని వీరయ్యను జగిత్యాల జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడు బొడ్డు బుచ్చన్న హైదరాబాద్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా కన్వీనర్ గాండ్ల రాములు, జిల్లా గౌరవ అధ్యక్షుడు అంకతి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాయల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు మంచాల అంజి ఉన్నారు.

✦ **రైతులను ఇబ్బంది పెట్టొద్దు**

జగిత్యాలరూరల్: రైతులను ఇబ్బంది పెట్టవద్దని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మంగేళ సాగు రైతుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా అటవీశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగేళ గ్రామ శివారులో నారపాక అనిల్, ప్రభాకర్ చేపట్టిన వ్యవసాయ పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారని, రైతులను ఇబ్బందులు పెట్టవద్దని కోరారు. కార్యక్రమంలో నాయకులు సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, చీటి శేఖర్‌రావు,అశోక్ పాల్గొన్నారు.

'కమిటీల పేరిట కాలయాపన'

కథలాపూర్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల నాయకులు తీట్ల శంకర్, నల్ల గంగాధర్ మండిపడ్డారు. బుధవారం కథలాపూర్‌లో పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ రూ. 2 లక్షల రుణమాఫీని భేషరతుగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పథకం డబ్బులు త్వరగా రైతులకు అందించాలని, జాప్యం చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు అందించాలన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

జగిత్యాల: రాష్ట్రంలో సమగ్ర శిక్షలో గత 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఎం వ్యక్తిగత సలహదారుడు నరేందర్‌రెడ్డికి సమగ్ర శిక్ష జాయింట్ కమిటీ ప్రధాన కార్యదర్శి రవీందర్ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని కోరారు.

✦ **ఎరువుల గోదాముల తనిఖీ**

కోరుట్ల రూరల్: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘ ఎరువుల గోదాములను జిల్లా వ్యవసాయ అధికారి వాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎఖీన్‌పూర్, మాదాపూర్, పైడిమడుగు, చిన్నమెట్‌పల్లి, అయిలాపూర్ పీఏసీఎస్ గోదాముల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వ, అమ్మకాలను పరిశీలించారు. ఈ పాస్ యంత్రంలో నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సీఈవోలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవీ వైభవ ప్రవచనాలు

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఆధ్యాత్మిక కేంద్రం గీతాభవన్‌లో సౌందర్య లహరి దేవీ వైభవం ప్రవచనాలు బుధవారం కొనసాగాయి. వేదపండితులు, పురాణ బ్రహ్మ, సభాపతి తిగుళ్ల విషుశర్మ ప్రవచనాలు చెప్పారు. సౌందర్య లహరిదేవి వైభవం ప్రవచనాలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. 9మంది బ్రాహ్మణ ముత్తైదువులకు వాయినం యిచ్చి పాదపూజ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నార్ల రజని, గంప రజని, పాత రాధ, సామాజిక కార్యకర్త తవుటు రాంచంద్రం,తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామ శివారులోని శ్రీ భూదేవి, నీలాదేవి సహిత జగన్నాథస్వామి ఆలయానికి బుధవారం జగిత్యాలకు చెందిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ ఎడమల శైలేందర్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాల్గొన్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ఆలయ అభివృద్ధికి తన వంతుగా విరాళం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీమాన్ చక్రపాణి శ్రీనివాసచార్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు సరస్వతీ మాత విగ్రహం వితరణ

పెగడపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి రిటైర్డ్ ఉద్యోగి జలుగం జగన్‌మోహన్‌రావు బుధవారం సరస్వతీ మాత పంచలోహ విగ్రహాన్ని పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం లలిత, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, మాజీ వార్డు సభ్యుడు శాంతపు రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

✦ **అద్దె బస్సుల డ్రైవర్లకు మొదటి ప్రాధాన్యమివ్వాలి**

కోరుట్ల: ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగాల భర్తీలో ఆర్టీసీ అద్దె బస్సుల డైవర్లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుట్ల ఆర్టీసీ ప్రైవేట్ డ్రైవర్ల యూనియన్ నాయకులు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీలో డ్రైవర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయటం శుభ పరిణామమని, గత 15 ఏళ్లుగా ఆర్టీసీని నమ్ముకుని పని చేస్తున్న తమకు అవకాశాలివ్వాలని కోరారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా తాము విధులు నిర్వహించామని, ఆర్టీసీ బస్సుల డ్రైవింగ్‌పై తమకు పూర్తి అవగాహన ఉందన్నారు. తమను గుర్తించి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌లను కోరారు.

✦ **విద్యార్థులకు ఎంతో ఉపయోగం**

జగిత్యాల: మహిళ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ పడాల తిరుపతి రచించిన మూడు పుస్తకాలు డిగ్రీ విద్యార్థులకు ఎంతో ఉపయోగమని ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. పడాల తిరుపతి రచించిన మూడు పుస్తకాలను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రొఫెసర్ రచించిన ఈ పుస్తకాలు విద్యార్థులకే కాకుండా అధ్యాపకులకు కూడా ఉపయోగపడతాయని, మరిన్ని పుస్తకాలను ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో రచించాలని సూచించారు. ఉన్నత విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు కూడా పుస్తకాలు రచించాలన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ చంద్రయ్య, వైస్ ప్రిన్సిపల్ సుల్తానా, హర్‌జ్యోత్‌కౌర్, జ్యోతిలక్ష్మి, సత్యప్రకాశ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

✦ **ధర్మపురి కోర్టు ఏజీపీగా రౌతు రాజేశ్**

ధర్మపురి: ధర్మపురి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా బుగ్గారం మండలంలోని శెకల్ల గ్రామానికి చెందిన న్యాయవాది రౌతు రాజేశ్‌ను నియమించినట్లు కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ధర్మపురిలో న్యాయవాదులు రాజేశ్‌ను సన్మానించి అభినందించారు.

✦ **డ్రెయినేజీ, రోడ్డు మరమ్మతు చేపట్టాలి**

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా నుంచి టవర్ వరకు రోడ్డు, డ్రెయినేజీ అధ్వానంగా ఉందని, డ్రెయినేజీ సైతం అస్తవ్యస్తంగా ఉందని, మరమ్మతులు చేపట్టాలని కోరుతూ 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి వినతిపత్రం అందజేశారు. గుంతలు పూడ్చకపోవడం వల్ల రోడ్డుపై నడిచివెళ్లే వారు అందులో పడిపోతున్నారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ రోడ్డు మరమ్మతులతో పాటు, గుంతలు పూడ్చాలని కోరారు.

✦ **ఉరివేసుకుని ఒకరిఆత్మహత్య**

ఇబ్రహీంపట్నం: మండలంలోని బర్దీపూర్ గ్రామంలో తాగుడికి బానిసై గుంటి నరేందర్ (40) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అనిల్ బుధవారం సాయంత్రం తెలిపారు. నరేందర్ ప్రతి రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు తాగుతున్నాడని, కుటుంబ సభ్యులు, బంధువులు చెప్పినా తాగుడు మానివేయడం లేదు. బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య గుంటి మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

✦ **మహిళపై దాడిచేసిన వ్యక్తులపై కేసు**

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయిలో ఓ మహిళపై దాడి చేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం కొల్వాయి గ్రామానికి చెందిన రామకిష్టు గంగాధర్ హోటల్ నిర్వహిస్తాడు. ఇదే హోటల్‌లోకి కామెర రాజేశ్వర్, నసీమా, లక్ష్మి, దస్తగిరి అక్రమంగా ప్రవేశించి తన భార్యను హోటల్ నుంచి బయటకు తీసుకువచ్చి అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేసి, చంపుతామని బెదిరించారని గంగాధర్ ఫిర్యాదు చేయడంతో రాజేశ్వర్, నసీమా నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

✦ **ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి**

ధర్మపురి: పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో ఈనెల 12న నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ వేముల నాగలక్ష్మి తెలిపారు. కరీంనగర్‌కు చెందిన సన్‌షైన్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో పలు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. పట్టణవాసులు వైద్య శిబిరంలో పాల్గొనాలని కోరారు.

వివాహిత అదృశ్యం

జగిత్యాలక్రైం: పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ వద్ద వివాహిత అదృశ్యమైనట్లు ఆమె అత్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. సారంగాపూర్ మండలం నాగునూర్ లచ్చక్కపేట గ్రామానికి చెందిన ఖమర్ కుమారుడికి ఊట్నూరుకు చెందిన మహిళతో వివాహం కాగా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల ఆమె కోడలు గర్భవతి అయిందని తెలిసి ఖమర్ మంగళవారం ఊట్నూరు వెళ్లింది. కోడలును ఆస్పత్రిలో చూపించేందుకు జగిత్యాలకు రమ్మని చెప్పి ఇద్దరు పిల్లలను తీసుకుని ఖమర్ జగిత్యాలకు వచ్చింది. ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద వైద్య పరీక్షలు చేయిస్తున్న తరుణంలో వివాహిత అదృశ్యమైంది. దీంతో ఖమర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు

ధర్మపురి(బుగ్గారం): గుడుంబా, నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ మహేందర్ సింగ్ హెచ్చరించారు. బుగ్గారం మండలంలోని గోపులాపూర్‌లో బుధవారం ఎక్సైజ్, పోలీస్‌శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో గుడుంబా నివారణతో పాటు, నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గుడుంబా, నాటుసారా తయారు చేసి, అమ్మితే నూతన చట్టాల ప్రకారం కఠిన చర్యలుంటాయని తెలిపారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గంజాయ్ నిర్మూలన, సైబర్ నేరాలు, దొంగతనాల నివారణలపై, నూతన చట్టాలు అమలుపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


నలుగురిపై కేసు నమోదు

సారంగాపూర్: మండలంలో లచ్చక్కపేటలో భూవివాద విషయంలో దాడి చేసి చంపుతామని బెదిరించిన నలుగురిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై దత్తాద్రి కథనం ప్రకారం ఆకుల అమృత, ఆకుల లింగయ్య కుటుంబాల మధ్య భూమి వివాదం ఉంది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న ఆకుల లింగయ్య కుటుంబ సభ్యులు ఆకుల అమృత కుమారుడు జనార్దన్‌ను పొలాం వద్ద దాడి చేసి గాయపరిచారు. అనంతరం అమృత ఇంటిలోనికి అక్రమంగా ప్రవేశించి అమృత, ఆమె కోడలు సుమలత, కుమారుడు జనార్దన్‌పై మరోసారి దాడి చేసి, చంపుతామని బెదిరించారు. ఈ దాడిలో జనార్దన్ తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై అమృత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆకుల లింగయ్య, ఆకుల లక్ష్మి, లింగయ్య అల్లుడు గుమ్మడి మహేశ్, కుమార్తె గుమ్మడి సరితపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ల పరికరాలు చోరీ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులో మూడు ట్రాక్టర్ల పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన కొండ ఆంజనేయులు, తరి అభినవ్, తరి అజయ్ ట్రాక్టర్ బ్యాటరీలు, టేప్‌రికార్డర్, లౌడ్ స్పీకర్ల ఎత్తుకెళ్లారు. రైతుల పొలాలు దున్ని మంగళవారం సాయంత్రం అక్కడే ఉంచారు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా పరికరాలు దొంగతనం జరిగినట్లు గుర్తించామని బాధితులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనపై వారు ఆరాతీస్తున్నారు. గ్రామంలో ఇటీవల ట్రాక్టర్ల పరికరాలు, వ్యవసాయ పనిముట్లను దొంగలు ఎత్తుకెళ్తున్నారని గ్రామస్తులు అంటున్నారు.

సీఎంపై అభిమానంతో..



రాయికల్: సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో రాయికల్ మండలం రాజానగర్ గ్రామానికి చెందిన చల్ల శ్రీనివాస్ పటేల్ అనే రైతు తన వరిపొలంలో వరినారును రుణమాఫీ ఆకారంలో పెంచి తన అభిమానాన్ని చాటుకున్నాడు.